# సాక్షి పెద్దపల్లి

7

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025




పెద్దపల్లిరూరల్ : శ్రీఆంజనేయస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



పెద్దపల్లిలో హనుమంతుని విగ్రహానికి అలంకరణ

## శ్రీ ఆంజనేయం



పెద్దపల్లిరూరల్ : తుర్కలమద్దికుంటలో హనుమాన్ భక్తుల పూజలు



కొండగట్టు అంజన్న సన్నిధిలో మాల విరమణ చేస్తున్న భక్తులు



పెద్దపల్లిరూరల్ : చీకురాయిరోడ్డు ఆలయంలో పూజలు

పెద్దపల్లిరూరల్: 'జై శ్రీరాం.. జైజై శ్రీరాం' నినాదాలతో జిల్లాలోని హనుమాన్ ఆలయాలు మార్మోగాయి. హనుమాన్ చినజయంతి సందర్భంగా పెద్దపల్లి, రామగుండం, సుల్తానాబాద్, మంథని తదితర ప్రాంతాల్లోని హనుమాన్, శ్రీసీతారామాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. పెద్దపల్లి స్టేషన్ రోడ్డు, ఎల్లమ్మచెరువుకట్ట, రంగంపల్లి, చందపల్లి, తెనుగువాడ తదితర ఆలయాల్లో వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. పెద్దకల్వల, పెద్దబొంకూర్, చీకురాయి, హన్మంతునిపేట, ముత్తారం, రాఘవాపూర్, రంగాపూర్, తుర్కలమద్దికుంట, నిట్టూరు తదితర గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అక్కడక్కడా అన్నదానాలు నిర్వహించారు.



కొండగట్టు అంజన్న దర్శనం కోసం భక్తుల బారులు



రామగుండం: హనుమాన్ భక్తుల ర్యాలీ

## న్యూస్‌రీల్

### ముగిసిన బ్రహ్మోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): చిన్నకల్వలలోని శ్రీమహమ్మాయిదేవీ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఈనెల 8న వేడుకలు ప్రారంభమయ్యాయి. చివరిరోజు మహాపూర్ణాహుతి హోమం, శ్రీహనుమాన్ జయంతి, మహాపడి నైవేద్య నివేదన, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారని నిర్వాహకుడు కృష్ణమాచార్యులు తదితరులు తెలిపారు.

### కార్పొరేట్లకే కేంద్రం మద్దతు



మాట్లాడుతున్న కె.రమ

రామగుండం: ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న కేంద్రప్రభుత్వం.. మతతత్వం, దేశభక్తి పేరిట విభజించి పాలిస్తోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యురాలు కె.రమ విమర్శించారు. అంతర్గాం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కుల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చ గొట్టి పాలన సాగించడంతో ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు జూపాక శ్రీనివాస్, కేజీ రామచందర్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, ఆడెపు శంకర్, గుమ్మడి వెంకన్న, గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, పెండ్యాల రమేశ్, కోడిపుంజుల లక్ష్మి, కట్ట తేజేశ్వర్, తీగుట్ల రాములు, కుమార్, మార్త రాధ, కొట్టె స్వరూప, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ పోటీలకు ఎంపిక





అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీలు

ధర్మారం(ధర్మపురి): స్థానిక ఆదర్శ(మోడల్ స్కూల్) విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బైకని శరణ్య ఫుట్‌బాల్ అండర్ –19 జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లో గతేడాది నవంబర్ 25 నుంచి 27 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిందన్నారు. ఈనెల 15 నుంచి 21వరకు మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగే పోటీల్లో మనరాష్ట్ర జట్టు తరఫున శరణ్య హాజరవుతుందన్నారు. శరణ్యను ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, పీఈటీలు కొమురయ్య, మేకల సంజీవరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

### వక్ఫ్‌బోర్డు బిల్లు రద్దు చేయాలి





మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ముస్లింలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం సవరించిన వక్ఫ్‌బోర్డు బిల్లును రద్దు చేయాలని ముస్లిం, ఇస్లామిక్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుతో ముస్లింలు తమ ఆస్తులపై హక్కులు కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. నాయకులు ముఫ్తి సాధిక్, మొహియుద్దీన్, ఫహీం, ఫయాజ్ అహ్మద్‌రషీ, షేక్ రుకునుద్దీన్, ముఫ్తి మజహర్ ఖాస్మీ, ఉస్మాన్ ఫక్రుద్దీన్, ముఫ్తి సయ్యద్ నవీద్, సైఫ్ హుస్సామీ, అతీఖుర్‌రెహమాన్, తాండ్ర సదానందం తదితరులు పాల్గొన్నారు.

### వంటశాలకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న అన్నయ్యగౌడ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): నీరుకుల్ల రోడ్డులోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ పరిసరాల్లో వంటశాల నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ శనిగరపు శంకరయ్య, దాతలు అల్లం సత్యనారాయణ–భాగ్యలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ పాల్గొన్నారు.

# రూ.4.5 కోట్లు.. 20 ఆఫీసులు

- అన్ని ప్రభుత్వ ఆఫీసులు ఒకేచోట
- ఇటీవల శంకుస్థాపన చేసిన ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- పనులు పట్టాలెక్కేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు
- ప్రజలకు మరింత చేరువలో సర్కారు సేవలు
- మండల కేంద్రాల్లోనూ నిర్మించేందుకు సన్నాహాలు



మంథనిలో సమీకృత సముదాయాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు(ఫైల్)

మంథని: జిల్లాల పునర్విభజన తర్వాత గతప్రభుత్వం అన్ని జిల్లాల్లో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాలను ఒకేచోట నిర్మించింది. ప్రజలకు సర్కారు సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. అనుకున్నట్లే ప్రభుత్వ ఆశయం నేరవేరింది. ఇదే తరహాలో డివిజన్ కేంద్రమైన మంథనిలోనూ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంతోపాటు మిగతా అన్నిప్రభుత్వ శాఖలతో కలిపి సమీకృత కార్యాలయాల నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు.

**ప్రగతిలో అగ్రభాగాన నిలిపే దిశగా**

మంథని నియోజకవర్గ రూపరేఖలు మార్చేలా మాస్టర్ ప్లాన్‌తో ముందుకు వెళ్తున్న ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు ప్రారంభించారు. సిద్దిపేట, సిరిసిల్ల తరహాలో మంథనిని ప్రగతి పథంలో తీసుకెళ్లి అగ్రభాగాన నిలిపేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఒకేచోట సమీకృత కార్యాలయాలు నిర్మిస్తున్నట్లు శంకుస్థాపన సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. మంథని మున్సిపల్ కార్యాలయానికి నూతన భవనం, పట్టణంలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి.. ఇలా అనేక అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

**మండల కేంద్రాల్లోనూ..**

మండల కేంద్రాల్లోనూ సమీకృత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేలా ప్రణాళిక తయారు చేశా రు. ఈ క్రమంలోనే కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల భవనాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. వీటితోపాటు ముత్తారంలో కూడా అన్ని అఫీసులు ఒకే చోట ఉండేలా ప్లాన్ చేసినట్లు సమాచారం. అనేక ప్రభుత్వ శాఖలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. సమీకృత కార్యాలయాలు నిర్మిస్తే అన్నిశాఖలకు సొంతభవనాలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వానికి అద్దెభారం తప్పనుంది. అంతేగాకుండా.. ఆ మూలకు ఓ ఆఫీ.. ఈ మూలన మరో కార్యాలయం ఉండ

**అన్ని కార్యాలయాలు ఒకేచోట**

మంథని పట్టణంలో ఆర్డీవో కార్యాలయంలోపాటు తహసీల్దార్, ఆర్ అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్, హార్టికల్చర్, ఎక్సైజ్, ఎంపీడీవో, సీటిపారుదల, విద్య, వ్యవసాయ, ఎస్టీవో, ఐసీడీఎస్, సబ్ రిజిస్ట్రార్, అటవీ, వెటర్నరీ, లేబర్, ఎస్సీ, బీసీ వెల్ఫేర్, ఎండోమెంట్ తదితర సుమారు 20 ప్రభుత్వ ఆఫీసులు ఒకేచోట ఉండేలా అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇందు కోసం రూ.4.5కోట్లతో భవన సముదాయాలు నిర్మించనున్నారు.

టంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు చిరునామా లభించక నానాఇబ్బందులు పడుతున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోటుకు చేరితే సమయం కలిసి వస్తుంది. ఆర్థికంగా ఆదా అవుతుంది. ప్రజలకు చిరునామా తెలుసుకోవడంలో గందరగోళం ఉండదు.

**ప్రజలకు సౌకర్యం**



అన్ని ప్రభుత్వ ఆఫీసులు ఒకేచోట నిర్మించడం ద్వారా ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. దళారీ వ్యవస్థ కనుమరుగవుతుంది. పనులు త్వరగా పూర్తవుతాయయి.

– బూడిద తిరుపతి, నాగారం, మంథని

**పారదర్శకత ఉంటుంది**



ప్రభుత్వ కార్యాయాలన్నీ ఒకేచోట ఉంటే అధికారుల్లో పారదర్శకత పెరుగుతుంది. డివిజన్ స్థాయి అధికారి సైతం అందుబాటులో ఉంటే మండలస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉంటారు. సంక్షేమ పథకాల వివరాలు సులభంగా తెలిసే వీలుంటుంది.

– గోటికార్ కిషన్, మంథని

### రాజ్యాంగాన్ని పరిరక్షించాలి



యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రాజ్యాంగ పరిరక్షణ ప్రతీపౌరుని బాధ్యత అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో రాజ్యాంగ పరిరక్షణ యాత్రను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'విభజించి పాలించు' పద్ధతితో దేశాన్ని ముక్కలు చేస్తోందని విమర్శించారు. సామాన్యుల హక్కులు కాలరాస్తూ, కార్పొరేట్ శక్తులు, ధనవంతులకే మద్దతు ఇస్తోందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాశ్, పాతిపెల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### ధర్మాన్ని కాపాడాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల(పెద్దపల్లి): రూపునారాయణపేట భక్తాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే విజయరమణారావు–పావని దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి



కార్యకర్త ఇంట్లో భోజనం చేస్తున్న నేతలు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రాభివృద్ధి తమ పార్టీతోనే సాధ్యమని, ప్రజలు తమకే మద్దతుగా నిలవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. 'గాం చలో.. ఘర్ చలో' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి స్థానిక బాలాజీనగర్‌లో ఇంటింటా పర్యటించారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కిలో బియ్యం ఇస్తూ.. లబ్ధిదారుల ఇళ్లు వెళ్లి ఆ బియ్యమే తిని వస్తున్నారని ఎద్దేవా చేశారు. నాయకులు చక్రధర్‌రెడ్డి, సతీశ్, సదానందం, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

**నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తాం**

కమాన్‌పూర్(మంథని): వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని గెలిపిస్తే నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. 'గాం చలో.. బస్తీ చలో' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ అర్హులైన ప్రతీఒక్కరికి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యడ సతీశ్, మచ్చగిరి రాము, దండె లక్ష్మీనారాయణ, మట్ట శంకర్, జంగెపెల్లి అజయ్, మల్లారపు అరుణ్, భూంపెల్లి మొండయ్య, కొమ్ము శ్రీనివాస్, వడ్లకొండ తిరుపతిగౌడ్, రమేశ్, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

### అణచివేతకు వ్యతిరేకంగా పోరు

గోదావరిఖని: సామాజిక అణచివేతకు వ్యతికంగా పోరాటం చేయాలని సీఐటీయూ రాష్ట అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఆర్జీ–1 ఏరియా జీడీకే–5 ఓసీపీ, జీడీకే–2ఏ గనులపై శనివారం విరాళాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సామాజిక ఉద్యమకారులకు విరాళాలు ఇచ్చి అండగా నిలవాలన్నారు. వేల ఏళ్లనాటి బూజుపట్టిన మనువాద సిద్ధాంతాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని యత్నిస్తోందన్నారు. దేశభక్తి ముసుగులో మతం పేరిట శ్రామిక ప్రజలు, కార్మికుల్లో చిచ్చు పెడుతోందని ధ్వజమెత్తారు. దళితులు, గిరిజనులు, మహిళలపై విచ్చలవిడిగా దాడులు చేస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టికల్–14కు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. పేదలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తుందన్నారు. తాము సేకరించిన నిధిని ఆయా సంఘాలకు అందజేస్తామని అన్నారు. నాయకులు ముత్యంరావు, బి.మధు, మేదరి సారయ్య, ఆరేపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, గౌస్, రవి ఉన్నారు.

## మహిళా కార్మికులపై వేధింపులు

- వేతనాలు నిలిపివేసిన బల్దియా అధికారులు
- ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన కార్మికులు
- అధికారుల తీరుపై నేతల ఆగ్రహం



గోడు వెళ్లబోసుకుంటున్న మహిళా కార్మికులు

కోల్‌సిటీ(రామగుండం): బల్దియా నర్సరీ మహిళా కార్మికులను అధికారులు మానసికంగా వేధిస్తున్నారని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వై.యాకయ్య, నడిపెల్లి మురళీధర్‌రావు ఆరోపించారు. బల్దియా ఆవరణలో శనివారం నర్సరీ మహిళా కార్మికులు తమ గోడును నాయకుల ఎదుట వెళ్లబోసుకున్నారు. ఈనెల వేతనాలు తమకు నిలివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నాయకులు వై.యాకయ్య, నడిపెల్లి మురళీధర్‌రావు మాట్లాడుతూ ఆర్నెల్లుగా కార్మికులను వేధిస్తున్నారన్నారు. ఓ అధికారి తమ ఇంటికి వచ్చి పిల్లలకు చదువు చెప్పాలని ఒత్తిడి చేశారని, చదువు చెప్పేంత చదువు తమకు రాదని, తాము రాలేమని సదరు అధికారికి కార్మికులు చెబితే వేధిస్తున్నారని ఆరోపించారు. మహిళా కార్మికురాలిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అధికారిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

# ఉక్కపోత.. దోమల మోత

- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- సింగరేణి కార్మికులకు నిద్రాభంగం
- సబ్‌స్టేషన్‌లో సిబ్బంది లేక అవస్థలు
- పోతనకాలనీ సమస్యలు పట్టని సింగరేణి యాజమాన్యం

సాక్షి ఫోటోస్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): విధులు నిర్వర్తించి ఇళ్లకు చేరుకునే సింగరేణి కార్మికులను ఉక్క పోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దోమలు ఎడాపెడా వాయిస్తున్నాయి. ఫలితంగా సెకండ్, నైట్‌డ్యూటీ చేసి వచ్చిన వారు సరిగి నిద్రపోవడంలేదు. ఫస్ట్, బీ– తదితర షిఫ్టులు చేసిన వారికీ విశ్రాంతి తీసుకోవడం గగనంగా మారుతోంది. ఇదంతా స్థానిక పోతనకాలనీలోని దుస్థితికి అద్దంపడుతోంది.

**సిబ్బంది లేరు.. తరచూ సమస్యలు..**

సింగరేణి ఆర్జీ–2 ఏరియా పరిధిలోని పోతనకాలనీలో 85 బ్లాక్‌లు, వాటి పరిధిలో 1,180 క్వార్టర్లు ఉన్నాయి. ఇందులోని 1,180 కార్మిక కుటుంబాలు నివాసం ఉండగా, దాదాపు 3వేల మందికి పైగా జనాభా ఉంటుంది. వీరి కోసం సమీపంలోనే సింగరేణి యాజమాన్యం 33/3.3 కేవీ సామర్థ్యంతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించింది. కానీ, అందులో సిబ్బందితోపాటు ఎలక్ట్రీషియన్‌ను నియమించలేదు.

**గంటల తరబడి నిరీక్షణ..**

ఏదోఒక కారణంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే మరమ్మతు చేసేందుకు సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండడంలేదు. దీంతో గంటల తరబడి సరఫరా నిలిచి కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఉదయంపూట కరెంట్ సరఫరా ఆగిపోతే ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. అసలే వేసవి.. ఆపై ఉక్కపోత.. రాత్రివేళ దోమల మోత.. కార్మిక కుటుంబాలేకాదు.. కార్మికులకూ నిద్రాభంగం కలుగుతోంది. తద్వారా పనిస్థలాల్లో సరిగా విధులు నిర్వర్తించే పరిస్థి తి ఉండదని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

**ఎలక్ట్రీషియన్ పోస్టు ఖాళీ..**

పోతనకాలనీ సబ్‌స్టేషన్‌లో నియమించిన ఎలక్ట్రీషియన్ నాలుగు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. దీంతో ఎలాంటి సమస్య తలెత్తినా పరిష్కారానికి నోచుకోవడం లేదు. సమాచారం కోసం సబ్‌స్టేషన్‌కు వెళ్లినా ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. తాళం వేసిన కార్యాలయమే దర్శనమిస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యైటింక్లయిన్‌కాలనీ సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఎలక్ట్రీషియన్.. అక్కడ విధులు ముగించుకుని పోతనకాలనీకి వస్తేనే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది. అప్పటిదాకా కరెంట్ కోసం కార్మిక కుటుంబాలు నిరీక్షించాల్సి వస్తోంది. రాత్రివేళ విద్యుత్ సరఫరా ఆగిపోతే.. ఆ రోజంతా జాగారం చేయడమేనని కార్మిక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



ఏజీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

**సిబ్బందిని నియమించాలి**

గోదావరిఖని: మహాకవిపోతనకాలనీలో విద్యుత్ సిబ్బంది లేక కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు బదావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, ఎస్‌వోటూ జీఎం రాముడు, వర్క్‌షాప్ ఏజీఎం ఎర్రన్నకు వినతిపత్రం అందజేశారు. ఎలక్ట్రీషియన్ లేక కాలనీ రోజుల తరబడి చిమ్మచీకట్లో ఉంటోందని తెలిపారు. తద్వారా దొంగల బెడద పెరిగిందన్నారు. నాయకులు నాచగోని దశరథంగౌడ్, సాలిగామ మల్లేశ్, ఆకుల రాజయ్య, తోకల సమ్మయ్య, గోపాల్‌రావు, వంగ సురేశ్, శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

**అధికారులు స్పందించాలి**



పోతనకాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎలక్ట్రీషియన్‌ను వెంటనే నియమించాలి. కరెంట్ పోతే కార్మిక కుటుంబాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

– పద్మ, పోతనకాలనీ

**ఇబ్బంది పడుతున్నం**



ఏదైనా కారణంతో కరెంట్ సరఫరా ఆగిపోతే పునరుద్ధరించే వారు లేరు. అసలే ఎండకాలం. ఉక్కపోతగా ఉంటుంది. దోమలు కుడుతున్నయి. చిన్నపిల్లలు, ముసలోళ్లు చాలా ఇబ్బంది పడుతున్నరు.

– సౌమ్య, పోతనకాలనీ

**వెంటనే నియమించాలి**



కరెంట్ పోతే కారణం చె ప్పేందుకు, ఎప్పుడు వస్తు ందనే సమయం చెప్పేందు కు ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదు. సింగరేణి యాజమాన్యం స్పందించి వెంటనే ఎలక్ట్రీయషన్‌ను నియమించాలి.

– లావణ్య, పోతనకాలనీ

**త్వరలోనే నియమిస్తాం**

ఆర్జీ–2 ఏరియాలోని పోతనకాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ ఎలక్ట్రీషియన్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆ పోస్టు కొన్ని నెలల నుంచి ఖాళీగా ఉంది. సమస్య పరిష్కరిస్తాం. ఇందుకోసం త్వరలోనే ఎలక్ట్రీషియన్‌ను నియమిస్తాం.

– ఎర్రన్న, ఏజీఎం, ఆర్జీ–2

## క్లుప్తంగా

### ట్రాక్టర్ ఢీకొని పలువురికి గాయాలు



గాయపడిన ఆశాలు కుటుంబ సభ్యులు

రామగిరి(మంథని): కల్వచర్ల గ్రామ పరిధిలో శనివారం ట్రాక్టర్, కారు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై చంద్రకుమార్, స్థానికుల కథనం ప్రకారం.. మహదేవపూర్ మండల సూరారం గ్రామానికి చెందిన ములకల్ల ఆశాలు కుటుంబసభ్యులతో కలిసి కారులో కొండగట్టు వెళ్లి తిరిగి మహదేవపూర్ వెళ్తున్నాడు. కల్వచర్ల వద్ద లారీని ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా సెంటినరీకాలనీ నుంచి పెద్దపల్లి వెళ్తున్న బ్లేడ్ ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టింది. దీంతో కారులోని ఆశాలు, భార్య సువర్ణ, కూతురు సుజాత, అల్లుడు రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. రామకృష్ణ తల్లి రమాదేవికి సైతం గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### తండ్రిని చంపిన తనయుడి రిమాండ్: సీఐ శ్రీనివాస్‌గౌడ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఒడ్డెరకాలనీకి చెందిన కుంచెపు కనకయ్యను కర్రతో కొట్టి చంపి పరారీలో ఉన్న అతని తనయుడిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎల్లారెడ్డిపేట ఠాణాలో శనివారం కేసు వివరాలను సీఐ శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. టెక్నికల్ ఎవిడెన్స్ ద్వారా నిందితుడు కుంచెపు పర్శరాములు ఎల్లారెడ్డిపేటకు వచ్చినట్లు తెలుసుకుని గాలించామన్నారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సంచరిస్తున్నట్లు అందిన సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు. తండ్రి మందలించాడని ఆవేశంతో కన్న తండ్రినే హత్య చేసిన నిందితుడిని పట్టుకొని విచారించగా.. తానే హత్య చేసినట్లు అంగీకరించాడన్నారు. వెంటనే రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో సహకరించిన ఎస్సై రమాకాంత్, సిబ్బందిని సీఐ అభినందించారు.

### భర్తకు అంత్యక్రియలు చేసిన భార్య

- క్షణికావేశంలో జైలులో కొడుకు
- ప్రాణాలు కోల్పోయిన భర్త
- ఒంటరైన మహిళ



భర్తకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న కనకయ్య భార్య దేవవ్వ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కడుపున పుట్టిన కొడుకు వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకుంటే కాలయముడిగా మారి కన్నతండ్రి ప్రాణాలు తీసి జైలుపాలయ్యాడు. కట్టుకున్న భర్త అంత్యక్రియలు భార్య నిర్వహించిన ఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుంది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కుంచెపు కనకయ్య(50) శుక్రవారం కన్నకొడుకు పర్శరాములు చేతిలో హతమైన విషయం తెలిసిందే. తండ్రి మృతికి కారణమైన కుమారుడు కుంచెపు పర్శరాములును పోలీసులు జైలుకు పంపించారు. కనకయ్య అంత్యక్రియలను అతని భార్య దేవవ్వ నిర్వహించడంతో స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు.



## నృసింహుని సన్నిధికి పోటెత్తిన భక్తులు





ధర్మపురి: ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం హనుమాన్ భక్తులతో శనివారం పోటెత్తింది. కొండగట్టు అంజన్నను దర్శించుకున్న భక్తులంతా లక్ష్మీనృసింహస్వామి సన్నిధికి చేరుకున్నారు. హనుమాన్ చిన్నజయంతి సందర్భంగా స్వామి అనుబంధం శ్రీప్రసన్నాంజనేయ స్వామివారికి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ భక్త భజన మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. నృసింహస్వామిని పలువురు నాయకులు దర్శించుకున్నారు. వీరిలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షుడు రామ్‌సింగ్, ప్రాంత గోరక్ష టోలి సభ్యులు ఊట్కూరి రాధాకృష్ణరెడ్డి, వాయుపుత్ర విభాగ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.





### రాజన్న క్షేత్రం.. కాషాయవర్ణం

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఆదివారం హనుమాన్ మాలధారుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తమ ఇలవేల్పునకు మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాజన్న ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లోని హనుమాన్ విగ్రహాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

## బీ-థర్మల్‌లో బదిలీల కలకలం

- యాదాద్రి పవర్ ప్లాంట్‌కు 85 మంది
- ఉత్తర్వులు జారీచేసిన పవర్ జనరేషన్ కార్పొరేషన్



బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం ముఖద్వారం

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండం థర్మల్ పవర్ స్టేషన్(ఆర్‌టీపీఎస్-బీ) 62.5 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ కేంద్రం మూతపడి పది నెలలు గడిచింది. ఈక్రమంలో శనివారం తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్, విద్యుత్ సౌధ నుంచి స్థానికంగా పనిచేసే 85 మంది ఉద్యోగులకు మూకుమ్మడి బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ఇందులో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) విభాగానికి చెందిన ఉద్యోగులు ఉన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్‌తోపాటు ఓఅండ్ఎంకు చెందిన -72, ఇంజినీర్లు-11మంది, ఏడీఈలు-ఒకరు బదిలీ అయిన వారిలో ఉన్నారు. మరోరెండు రోజుల్లో రెండోజాబితాలో మిగతా విభాగాల ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు రానున్నాయనే ఊహాగానాలు వస్తున్నాయి. మరోవైపు.. ఉద్యోగ విరమణకు మరో మూడేళ్ల వ్యవధి ఉండే వారిని బదిలీ చేసే అవకాశం లేదని తెలుస్తోంది.

**కాలంచెల్లిన జాబితాలో బీ-థర్మల్..**

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే తొలి విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా ఉన్న రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ అనేక రికార్డుల సాధించింది. అరవై ఏళ్ల జీవిత కాలం పూర్తవడంతో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తాయి. అప్పటి సాంకేతిక పరిజ్ఞానానికి సరిపడే విడిభాగాలు లభించడంలేదు. దీంతో గతేడాది జూన్ 6వ తేదీన విద్యుత్ కేంద్రం మూతపడింది.

**మూడు తరాలతో విడదీయరాని బంధం..**

తాతలు, తండ్రులు, చివరగా కుమారులు.. ఇలా మూడు తరాలు విద్యుత్ కేంద్రంతో విడదీయరాని బంధం కలిగి ఉన్నారు. ఇక్కడే ప్రస్తుతం యాదాద్రి విద్యుత్ కేంద్రానికి బదిలీ చేస్తూ ఒక్కసారిగా ఉత్తర్వులు వెలువడడంతో ఉద్వేగానికి లోనవుతున్నారు.

### స్థానికంగా కొందరు

యాదాద్రిలో 800 మెగావాట్ల సామర్థ్యంతో ఐదు విద్యుత్ కేంద్రాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఒక యూనిట్ పూర్తయ్యింది. త్వరలో రెండో యూనిట్ కమీషన్ చేసే అవకాశం ఉంది. ఇలా దశలవారీగా అన్నియూనిట్లను విద్యుత్ ఉత్పత్తి దశలోకి వేగవంతంగా తీసుకురావాలనే ఉద్దేశంతో ఇక్కడి ఉద్యోగులను మూకుమ్మడిగా యాదాద్రికి బదిలీ చేసినట్లు తెలిసింది. రెండో లిస్టులో ఎంతమందిని బదిలీ చేస్తారనే విషయమై స్పష్టత లేదు. ప్రస్తుతం ఉన్న బీ-థర్మల్‌ను కూలదోసే క్రమంలో స్థానికంగా కొంత మంది ఇంజినీర్లను స్థానికంగానే కొనసాగించే అవకాశాలున్నట్లు విశ్వసనీయ సమాచారం.

– దాసరి శంకరయ్య, ఇన్‌చార్జి ఎస్ఈ, బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం, రామగుండం

## అంకుల్ ఫోన్ చేసుకుంటాం అంటూ..

- ఆర్టీసీ డ్రైవర్ సెల్‌ఫోన్‌తో ఉడాయించిన యువకులు
- డయల్ 100కు ఫోన్ చేస్తే స్పందించని పోలీసులు

శంకరపట్నం: 'అంకుల్ మా సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. ఒకసారి మీ ఫోన్ ఇస్తే.. ఒక కాల్ చేసుకుని ఇస్తాం'.. అంటూ ముగ్గురు యువకులు ఓ ఆర్టీసీ డ్రైవర్‌కు చెందిన సెల్‌ఫోన్ తీసుకుని ఉడాయించారు. ఈ ఘటన శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. మొలంగూర్ గ్రామానికి చెందిన సాయిరెడ్డి మెట్‌పల్లి డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని శుక్రవారం అర్ధరాత్రి మొలంగూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు దిగాడు. ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న సాయిరెడ్డికి ముగ్గురు యువకులు తారసపడ్డారు. 'అంకుల్ మా ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. ఫోన్ చేసుకుంటాం. ఒకసారి ఫోన్ ఇస్తారా' అని అడగడంతో సాయిరెడ్డి ఇచ్చాడు. వెంటనే బైక్ స్టార్ట్‌చేసి ముగ్గురు యువకులు సెల్‌ఫోన్‌తో ఉడాయించారు. సమీపంలోని ఇంటికి పరుగెత్తుకెళ్లిన సాయిరెడ్డి ఇంట్లో బ్యాగ్ పెట్టి, బైక్ తీసుకుని యువకులను వెంబడించాడు. జమ్మికుంటలో వారిని పట్టుకున్నాడు. రూ.1000 ఇస్తే సెల్‌ఫోన్ ఇస్తామని ఆ యువకులు చెప్పారు. ఇవ్వననడంతో మరోసారి సాయిరెడ్డి కళ్లుగప్పి పరారయ్యారు. సాయిరెడ్డి హడావుడిగా బయటికి వెళ్లడం గమనించిన ఆయన భార్య ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో కంగారుతో డయల్ 100ను సంప్రదించింది. వారినుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలిపింది. కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌కు శనివారం ఫిర్యాదు చేసేందుకు సాయిరెడ్డి వెళ్లాడు. వారు జమ్మికుంటలో ఫిర్యాదు చేయమన్నారని, జమ్మికుంట పోలీసులు కేశవపట్నంలో ఫిర్యాదు చేయాలని అంటున్నారని తెలిపాడు.

## వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు



గాయపడిన సారంగపాణి

ఓదెల(పెద్దపల్లి): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన తెట్టె సురేశ్ గోపరపల్లిలో చేపట్టిన సీసీరోడ్డు పనులు చేసేందుకు వచ్చాడు. భోజన విరామ సమయంలో గోపరపల్లి నుంచి పెగడపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తలపగిలి తీవ్రగాయాలు కావడంతో సుల్తానాబాద్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

**బైక్ అదుపుతప్పిన మరో ఘటనలో..**

మడక గ్రామానికి చెందిన పోశారం సారంగపాణి బైక్‌పై పొత్కపల్లి నుంచి మడకకు వస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది సుల్తానాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

## ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత వి.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: అల్ఫోర్స్ ఈ- టెక్నో పాఠశాల విద్యార్థులు జోనల్‌స్థాయి అంతర్జాతీయ సాంఘికశాస్త్ర ఒలింపియాడ్ పోటీల్లో బంగారు పతకాలను సాధించడంతో వారిని అల్ఫోర్స్ విద్య సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి శనివారం అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు బొంగోని కార్తికేయ, హరిశ్రీ హరిణి, ఎం.విఘ్నేష్చంద్ర, హిమేశ్‌చంద్ర బంగారు పతకాలను సాధించడం జరిగింది.

**టైనీటాట్స్‌లో గ్రాడ్యుయేషన్ డే**

అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలలో శనివారం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అల్ఫోర్స్ విద్య సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి చిన్నారులకు పట్టాలు అందజేశారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## చల్‌గల్‌లో మామిడి కొనుగోళ్లు ప్రారంభం



బహిరంగ వేలం ద్వారా మామిడి కొనుగోళ్లు చేస్తున్న వ్యాపారులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ మామిడి మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. వ్యాపారుల్లో కొందరు బహిరంగ వేలం ద్వారా.. మరికొందరు కమీషన్ ప్రతిపాదికన కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్ నిబంధనల ప్రకారం ప్రతి వ్యాపారి బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేయాలని మార్కెట్ అధికారులు చెపుతున్నప్పటికీ కొందరు వ్యాపారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల మాజీమంత్రి జీవన్ రెడ్డితోపాటు రైతు సంఘం నాయకులు, మామిడి మార్కెట్‌లో బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మార్కెట్ ప్రారంభమైనా విధివిధానాలు నిర్ణయించకపోవడంతో రైతులు, వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. రైతుల నుంచి వ్యాపారులు ఏమైనా కటింగ్‌లు చేస్తారా..? మార్కెట్ కమిటీకి వ్యాపారులు ఏ మేరకు మార్కెట్ ఫీజు చెల్లిస్తారు..? వంటి విషయాలు ఎవరికీ అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

**బంగినపల్లికి కిలో రూ.35 నుంచి రూ.46**

చల్‌గల్ మార్కెట్‌లో బంగినపల్లి మామిడికి కిలో రూ.35 నుంచి రూ.46 వరకు పలుకుతోంది. దోరికి రూ.65 నుంచి రూ.70, హిమాయత్ రకానికి రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. చల్‌గల్ మార్కెట్‌కు 30 నుంచి 35 టన్నుల మామిడికాయలు వచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

## రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

- తగలబడిన ఐదు వేల క్వింటాళ్ల ధాన్యం
- 85 వేల గన్నీ సంచులు దగ్ధం



రైస్‌మిల్లులో ఎగిసిపడుతున్న మంటలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల శివారులోని మహలక్ష్మీ రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మిల్లులో నిల్వ చేసిన ధాన్యం, గన్నీ సంచులు దగ్ధమైనట్లు రైస్‌మిల్ యజమాని గంగారెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున మిల్లులో మంటలు చెలరేగుతున్నట్లు అందులో పనిచేసే ఓ కార్మికుడు యజమాని గంగారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న ఆయన మంటలను గమనించి అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. డీసీఎస్ జితేందర్‌రెడ్డి, డీటీసీఎస్ ఉమాపతి, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రాజేందర్‌రావు, అగ్నిమాపక శాఖ అధికారి మల్లికార్జున్, ఆర్ఐ ఉమేశ్, పోలీసులు రైస్‌మిల్లు వద్దకు చేరుకొని ఘటనపై ఆరా తీశారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయాలతోపాటు నష్టంపై ఆరా తీశారు. మిల్లులో దాదాపు 20 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం నిల్వ ఉంది. అందులోంచి సుమారు 5 వేల క్వింటాళ్ల ధాన్యం, 85 వేల గన్నీ సంచులు దగ్ధమైనట్లు యజమాని అధికారులకు తెలిపారు. సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేసినట్లు తెలిసింది.

### అగ్నిప్రమాదంలో రెండిళ్లు దగ్ధం

కథలాపూర్: కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన సుద్దాల బుచ్చిరాజు, సుద్దాల మల్లమ్మ ఇళ్లు అగ్నిప్రమాదంలో కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. బుచ్చిరాజు శనివారం ఉదయం బయటకు వెళ్లి వచ్చి చూసేసరికి మంటలు అంటుకున్నాయి. కొద్దిసేపటికి ఇంట్లోని వంటగ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఇంటి పైకప్పు కూలింది. ఇంటిపక్కనే ఉన్న సుద్దాల మల్లమ్మ ఇంట్లోకి మంటలు వ్యాపించాయి. ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పేసింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షలు ఆర్థిక నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

### షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు..



గొడిశాలలో దగ్ధమైన ఇల్లు

సైదాపూర్: మండలంలోని గొడిశాలలో శనివారం మూల శ్రీనివాస్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కరెంట్ వైర్లు షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంచం, టీవీ, బట్టలు, ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు శ్రీనివాస్ వాపోయాడు.

## విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చాం



ఎమ్మెల్యే కమలాకర్ కూతురు జాహ్నవికి ఎంబీబీఎస్ పట్టా ప్రదానం చేస్తున్న కేటీఆర్

- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్
- చల్మెడ మెడికల్ కళాశాలలో స్నాతకోత్సవం

కరీంనగర్‌రూరల్: బీఆర్ఎస్ హయాంలో విద్య, వైద్యరంగానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చినట్లు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో శనివారం 2019 సంవత్సరం ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రతీ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలను మంజూరు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుతూ వైద్యులుగా మారుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో వైద్యులకు ఏఐ చాలెంజ్‌గా మారుతుందని తెలిపారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ చల్మెడ మెడికల్ కళాశాల హైదరాబాద్ కళాశాలలకు దీటుగా వైద్యవిద్యను నేర్పిస్తుండటంతో తన కూతురును చేర్పించినట్లు తెలిపారు. కళాశాల చైర్మెన్ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ..తెలంగాణలో ఏ మెడికల్ కళాశాలలో లేని సిమ్యులేషన్ ల్యాబ్‌ను చల్మెడ వైద్య విద్యార్థులకు అందుబాటులోకి తీసుకరావడం జరిగిందన్నారు.అనంతరం 124మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, కళాశాల డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఆసీంఅలీ, వైస్ ప్రిన్సిపాల్ అనిత, సూపరింటెండెంట్ రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో లారీ, కంటైనర్ ఢీ



డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

- లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్
- రెండు గంటల పాటు నరకయాతన

మెట్‌పల్లి: పట్టణంలోని జాతీయ రహదారిపై శనివారం ఓ లారీ, కంటైనర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. సుమారు రెండు గంటల పాటు తీవ్ర అవస్థలు పడగా.. పోలీసులు శ్రమించి అతడిని బయటకు తీశారు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్షయ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడ్‌తో మహారాష్ట్ర వైపు వెళ్తోంది. మార్గమధ్యంలో మెట్‌పల్లి ఎస్సారెస్పీ వంతెన మీదకు రాగానే ఎదురుగా కంటైనర్ వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో గ్రానైట్ లారీ ముందు భాగం దెబ్బతింది. అందులో ఉన్న డ్రైవర్ పరదేశీ కుడికాలు అందులోనే చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న డీఎస్పీ రాములు, ఎస్సైలు కిరణ్‌కుమార్, అనిల్ అక్కడకు చేరుకొని రెండు గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరోవైపు గ్రానైట్ లారీని అక్కడి నుంచి తొలగించడం కష్టంగా మారడంతో కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చివరకు రెండు క్రేన్ల సహాయంతో తొలగించారు. ట్రాన్స్‌పోర్టు సూపర్‌వైజర్ వెంకట్రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## అపురూప శిల్పాలపై పట్టింపు కరువు

- పురావస్తు పరిశీలకుడు నాగిరెడ్డి



భీమేశ్వరాలయంలో పడేసిన అపురూప శిల్పాలను చూస్తున్న నాగిరెడ్డి

వేములవాడ: రాజన్న ఆలయ అనుబంధ భీమేశ్వర స్వామి గుడిలో ఏళ్లనాటి అపురూప శిల్పకళపై రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పురావస్తు పురావాస్తు పరిశీలకుడు నాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం భీమేశ్వరాలయంలోని మూలనపడేసిన శిల్పకళా రూపాలను స్థానిక చరిత్రకారుడు సంకెపల్లి నాగేంద్రశర్మతో కలసి పరిశీలించారు. 9వ శతాబ్దం నాటి గణేశ్, ఛాముండి, సప్తమాతలు, శివలింగాలు, నంది, కుబేర, జైన మహవీర, పార్శ్వనాథ శిల్పాలను ఆలయన ఆవరణలో పడేశారన్నారు. అపురూప శిల్పాలను కాపాడాల్సిన బాధ్యత దేవాదాయశాఖ అధికారులపై ఉందన్నారు.

## వనజీవి రామయ్యకు జిల్లాతో అనుబంధం



సుద్దాల విద్యార్థులతో వనజీవి రామయ్య



రామయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు(ఫైల్)

- జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటున్న జిల్లా వాసులు
- రాజన్న సిరిసిల్లకు పలుమార్లు రాక



సిరిసిల్లలో వనజీవి రామయ్యతో ప్రకృతి ప్రకాశ్, వేముల మార్కండేయులు(ఫైల్)

సిరిసిల్ల/కోనరావుపేట(వేములవాడ): వనజీవి దర్పల్లి రామయ్యతో జిల్లాకు అనుబంధం ఉంది. జిల్లాకు చెందిన ప్రకృతి ప్రేమికులు చేస్తున్న వనసంరక్షణ చర్యలను గుర్తించి జిల్లాలో పర్యటించారు. చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రచారం చేశారు. జిల్లాకు 2019వ సంవత్సరం జనవరి 13న వచ్చారు. కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రకాశ్ పర్యావరణ సేవలను గుర్తించి ఆ గ్రామానికి వచ్చారు. చెట్ల ప్రాముఖ్యతను ఆ గ్రామ పాఠశాల విద్యార్థులకు వివరించారు. జనవరి 19న సిరిసిల్ల కాలేజీగ్రౌండ్‌లో పర్యావరణ సదస్సుకు హాజరై.. మొక్కల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అంతకుముందు మూడుసార్లు సిరిసిల్లకు వచ్చారు. అప్పటి కలెక్టర్ కృష్ణభాస్కర్ వనజీవి రామయ్యను సత్కరించారు. ఆయన మరణంపై పలువురు జిల్లా వాసులు సంతాపం తెలిపారు. రామయ్య మృతిపై సిరిసిల్లకు చెందిన ప్రకృతి ప్రకాశ్(దొబ్బల), సామాజిక సేవకుడు వేముల మార్కండేయులు సంతాపం తెలిపారు. రామయ్య మరణవార్త తెలియగానే ప్రకృతి ప్రకాశ్ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వెళ్లారు. రామయ్య మృతదేహం వద్ద నివాళి అర్పించారు.